మాజీ సీఎం, జననేత జగన్ చివరిసారిగా నియోజకవర్గానికి 2024 ఎన్నికల ప్రచారం లో వచ్చారు. ఆ తర్వాత ఇదే తొలిసారి. అది కూడా నర్సీపట్నంలో వైద్య కళాశాల పర్యటనలో భాగంగా నియోజకవర్గం మీదుగా వెళ్లారు. అది చాలు కదా.. ఆయన్ని గుండెల్లో పెట్టుకున్న అభిమాన జనానికి. మారుమూల ప్రాంతాల నుంచి కూడా జనాలు ఉవ్వెత్తున పెందుర్తి రోడ్డుకు చేరుకున్నారు. తమ అభిమాన నేతను కళ్లారా చూసి, చేతులతో అభివాదం చేస్తూ, కేరింతలు కొడుతూ పరవశించారు. కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలనను తామెంతగా వ్యతిరేకిస్తున్నారో.. చెప్పకనే చెప్పారు.


పెందుర్తి కూడలిలో అభిమానుల కోలాహలం

జననేతను చూసి.. జనమెంతో మురిసి!


జగన్‌ను చూసేందుకు తరలివెళ్లిన పరవాడ ప్రాంత నాయకులు, కార్యకర్తలు


సబ్బవరం వంతెన వద్ద జెడ్పీటీసీ పీఎస్ రాజు, పార్టీ నాయకులను అడ్డగిస్తున్న పోలీసులు


వైఎస్సార్‌సీపీ నాయకులను అడ్డుకుంటున్న పరవాడ సీఐ మల్లికార్జునరావు


చిన్నయ్యపాలెం హైవేపై జగన్‌కు స్వాగతం పలికేందుకు ఎదురుచూస్తున్న అభిమానులు


పెందుర్తి కూడలి వద్ద తమ అభిమాన నేత కోసం వేచి ఉన్న జనసందోహం


పెందుర్తి కూడలి వద్ద తమ అభిమాన నేత వైఎస్ జగన్ వీడియోలు, ఫొటోలు తీస్తున్న యువతుల, మహిళలు


వైఎస్ జగన్‌ను చూడగానే అభిమానుల కేరింతలు


పెందుర్తి నాలుగు రోడ్ల కూడలి వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్

- మాజీ సీఎం వైఎస్ జగన్‌కు అడుగడుగునా నీరా'జనం'
- ఆర్ఆర్ వెంకటాపురం నుంచి పెందుర్తి వరకు పోటెత్తిన అభిమానం
- మండుటెండలో కూడళ్ల వద్ద అభిమాన నేత కోసం ఎదురుచూపులు
- ఎక్కడికక్కడ జనాన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వం, పోలీసుల విఫలయత్నం

పెందుర్తి: సంక్షేమ రథసారథిగా.. పేదల పక్షపాతిగా ఐదేళ్లు పారదర్శక పాలన అందించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నియోజకవర్గ ప్రజలు ఘన స్వాగతం పలికారు. సార్వత్రిక ఎన్నికల తరువాత తొలిసారి నియోజకవర్గంలో అడుగు పెట్టిన జగన్‌కు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం దారి పొడవునా నీరాజనం పట్టారు. ఆర్ఆర్ వెంకటాపురంలో వైఎస్ జగన్ కాన్వాయ్ అడుగు పెట్టగానే అదీప్‌రాజ్ స్వాగతం పలికారు. నాయుడుతోట, వేపగుంట, పురుషోత్తపురం, సుజాతనగర్, చినముషిడివాడ కూడళ్ల వద్ద వేలాదిగా ప్రజలు ఉండడంతో వారందరికీ అభివాదం చేసుకుంటూ జగన్ ముందుకు సాగారు.

పోటెత్తిన పెందుర్తి కూడలి

జగన్ పెందుర్తికి వస్తున్న విషయం తెలుసుకుని నియోజవర్గవ్యాప్తంగా తండోపతండోలుగా జనం తరలివచ్చారు. ఉదయం 10 గంటల నుంచే పెందుర్తి కూడలికి చేరుకున్నారు. ఎండ తీక్షణంగా మండుతున్నా జననేత కోసం ప్రజలు దాదాపు 3 గంటలకు పైగా వేచి ఉన్నారు. పెందుర్తి పట్టణం, గ్రామీణం, వేపగుంట, పరవాడ, సబ్బవరం, నరవ ప్రాంతాల నుంచి ఆటోలు, బైక్‌లతో యువకులు ర్యాలీగా తరలివచ్చారు. పెందుర్తి కూడలి వద్దకు సరిగ్గా మధ్యాహ్నం 12.50 గంటలకు చేరుకున్న వైఎస్ జగన్ కాన్వాయ్‌ను వేలాదిగా జనం చుట్టుముట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. 'జై జగన్.. సీఎం సీఎం'నినాదాలతో హోరెత్తించారు. వాణిజ్య సముదాయాలు, రోడ్డు పక్కన నిల్చుని యువత, మహిళలు తమ సెల్‌ఫోన్లలో వైఎస్ జగన్ చిత్రాలు తీసుకుని తమ అభిమానాన్ని చాటుకున్నారు. దాదాపు 15 నిమిషాల పాటు జగన్ కాన్వాయ్‌ను అభిమానులు కదలనివ్వలేదు. మొత్తానికి నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో వైఎస్ జగన్ పర్యటన నూతనోత్తేజాన్ని నింపింది.

అడ్డంకులను ఛేదించి..

వైఎస్ జగన్ చూసేందుకు పెందుర్తి కూడలికి భారీ జనసందోహం తరలివచ్చింది. వారిని అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం విఫలయత్నం చేసింది. పెందుర్తి రైల్వే బ్రిడ్జి సమీపంలో పదుల సంఖ్యలో పోలీసులు మాటు వేసి ఉదయం నుంచీ అటుగా వచ్చిన ప్రతి ఆటో, బైక్, ఆర్టీసీ బస్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. జగన్‌ను చూసేందుకు అని ఎవరైనా చెబితే వెంటనే వారిని వెనక్కి వెళ్లాలని హెచ్చరికలు జారీ చేశారు. అటుగా వచ్చిన అదీప్‌రాజ్ సహా ఇతర నాయకులను కూడా పోలీసులు నిలువరించే ప్రయత్నం చేశారు. దీంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన అదీప్‌రాజ్ నిరసన వ్యక్తం చేస్తూ అక్కడే బైటాయించారు. దీంతో దిగి వచ్చిన పోలీసులు జనాలను అడ్డుకునే ప్రయత్నాన్ని విరమించుకున్నారు.

ఉత్సాహంగా నాయకులు

నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సారథ్యంలో నియోజకవర్గంలోని పార్టీ నేతలంతా ఉత్సాహంగా పెందుర్తి కూడలికి తరలివచ్చారు. జగన్‌ను చూసేందుకు తరలి వస్తున్న జనంతో కలిసి నాయలకులంతా పెందుర్తి కూడలి వద్ద కలియతిరిగారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయిలపూడి భగవాన్ జయరామ్, సీఈసీ సభ్యులు శరగడం చిన అప్పలనాయుడు, పైలా శ్రీనివాసరావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కోడిగుడ్ల దేవిసాంబ, సీనియర్ నేత గండి రవికుమార్, జెడ్పీటీసీ పీఎస్ రాజు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కొటాన రాము, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి సురేష్ రాజ్, పెందుర్తి, సబ్బవరం, పరవాడ మండల పార్టీ అధ్యక్షులు గొరపల్లి శ్రీను, కర్రిబాబు, కోన రామారావు, వార్డుల అధ్యక్షులు మెంటి మహేష్, దాసరి సత్తిబాబు, రాపర్తి మాధవరావు, తామర్ల నర్సింగ్, కొలుసు ఈశ్వరరావు, దాడి ఉమామహేశ్వరరావు, గండ్రెడ్డి మహాలక్ష్మినాయుడు, అప్పికొండ మహాలక్ష్మినాయుడు, పార్టీ సీనియర్ నాయకులు ఉప్పిలి కనకరాజు, బోకం రామునాయుడు, మధుపాడ అంజి, సబ్బవరపు నారాయణమూర్తి, కొయిలాడ శ్రీను, కోరాడ చందుయాదవ్, యతిరాజుల నాగేశ్వరరావు, గొరపల్లి సాంబ, బల్ల రాంబాబు, బీఎస్ రాజు, కాళ్ల గంగాధర్, మద్ది శ్రీనివాసరావు, బట్టు పైడిరెడ్డి, ఉగ్గిన గోవింద్, కోన శ్రీనివాసరావు, గొంప అప్పారావు, కోన సంజీవరావు, బుదిరెడ్ల రామకృష్ణ, బలిరెడ్డి కనకరాజు, కాపుశెట్టి శేషు బాబు, కర్రి శ్రీను, వడ్డాది అప్పలరాజు, బొడ్డపు చిన్నారావు, పీతల అప్పలరాజు, గోవింద్ పట్నాయక్, కర్రి స్వామి, లంక సత్తిబాబు, కొన కృష్ణ, యర్రాజీ రావు, మజ్జి ధర్మ, మజ్జి భీమ, మజ్జి అప్పలరమణ, ఆదిరెడ్డి, తెడ్లపు మహేష్, తాతబాబు, వేలాదిగా కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు

పరవాడ: నర్సీపట్నం మెడికల్ కళాశాల పరిశీలనకు వస్తున్న రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని చూసేందుకు పరవాడ మండలం నుంచి పెందుర్తి బయల్దేరిన వైఎస్సార్‌సీపీ శ్రేణులను పరవాడ పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు.

లంకెలపాలెం వంతెన వద్ద పదుల సంఖ్యలో పోలీసులు మోహరించారు. పరవాడ జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ రాజు, వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజులు ప్రయాణిస్తున్న కారును సబ్బవరం వంతెన వద్ద నిలిపివేసి తనిఖీలు జరిపారు. ముత్యాలమ్మపాలేనికి చెందిన పార్టీ నాయకులు బొంది అచ్చిబాబు, సూరాడ మసేను, దూడ అప్పారావులను లంకెలపాలెం వంతెన వద్ద నిలిపివేశారు.

- మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం పెందుర్తి తరలివెళ్లారు. పోలీసుల అడ్డంకులను దాటుకుని వెళ్లి తమ అభిమాన నాయకుడిని చూసినట్లు పార్టీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పీఎస్ రాజు, అన్నంరెడ్డి అజేయ్‌రాజ్ ఆధ్వర్యంలో పరవాడ, వెన్నలపాలెం, ముత్యాలమ్మపాలెం, బొడ్డపువానిపాలెం, గొర్లివానిపాలెం, నాయుడుపాలెం, వాడచీపురుపల్లి, పెద ముషిడివాడ, లంకెలపాలెం, కన్నూరు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. పరవాడ నుంచి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, పైల హరీష్, పైడినాయుడు, వెన్నలపాలెం సర్పంచ్ వెన్నల అప్పారావు, పార్టీ నాయకులు మాసవరపు ముత్యాలనాయుడు, పైల అప్పలనాయుడు, వెన్నల రేగారావు, సూరిబాబు, పైల సత్యానారాయణ, బొడ్డపువానిపాలెం నుంచి పార్టీ మండల మాజీ అధ్యక్షుడు బొడ్డపు చిన్నారావు తదితరులు ఉన్నారు.

సబ్బవరం: వైద్య కళాశాల సందర్శనకు వెళ్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సబ్బవరం జాతీయ రహదారి చిన్నయ్యపాలెం వద్ద అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ, తమ అభిమానాన్ని చాటుకున్నారు. వారిని చూసిన జగన్ కాన్వాయ్ వెహికల్ బయటకు వచ్చిన అభివాదం చేశారు. ఉదయం నుంచే పార్టీ శ్రేణులు పెందుర్తిలో ఆయనకు స్వాగతం పలికేందుకు పెద్దఎత్తున తరలి వెళ్తుండగా అడుగడుగునా పోలీస్‌లు అడ్డుకున్నారు. అయినప్పటికీ మండలంలోని పలు గ్రామాల నుంచి భారీగా పార్టీ శ్రేణులు తరలివెళ్లారు.

వైఎస్ జగన్‌తో చిన్నారి జగన్



పెందుర్తి: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మున్సిపల్ విభాగం అధ్యక్షుడు, 97వ వార్డు పార్టీ అధ్యక్షుడు మెంటి మహేష్ తన అభిమాన నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానాన్ని ఘనంగా చాటుకున్నారు. అనకాపల్లి పర్యటన నిమిత్తం పెందుర్తి మీదుగా వెళ్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌కు చినముషిడివాడ కూడలి వద్ద భారీ జన సందోహంతో స్వాగతం పలికారు. ఈ క్రమంలో మహేష్, ప్రమీల దంపతులు ఇంకా నామకరణం జరపని తమ ఏడు నెలల కుమారుడిని వైఎస్ జగన్‌కు అందించారు. ఆప్యాయంగా ఆ బాలుడ్ని హత్తుకున్న వైఎస్ జగన్ కాసేపు ముద్దాడారు. ఈ క్రమంలో తన కుమారుడికి 'జూనియర్ జగన్' పేరు పెట్టుకుంటామని మెంటి మహేష్ దంపతులు వైఎస్ జగన్ సమక్షంలో ఆనందంగా ప్రకటించారు.




పెందుర్తి నాలుగు రోడ్ల కూడలి వద్ద జగన్ రాకకోసం ఎదురుచూస్తున్న నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు


అప్పన్నపాలెం వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు

క్లుప్తంగా

పోరాట యోధుడు చేగువేరా


చేగువేరా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిటు నాయకులు

పరవాడ: ప్రపంచదేశాల్లో స్వాతంత్య్రం, ప్రజల హక్కుల కోసం తుది శ్వాస విడిచే వరకు పోరాడిన కమ్యూనిస్ట్ యోధుడు చేగువేరాను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సిటు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ సూచించారు. విప్లవ వీరుడు చేగువీరా వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం పరవాడలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘననివాళులర్పించారు. అనంతరం గనిశెట్టి మాట్లాడుతూ చేగువేరా పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శమన్నారు. ఆయన సిద్ధాంతాలను ప్రజలు ఎప్పుడూ గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిటు నాయకులు ఆర్.బాబూరావు, అప్పలరాజు, మంగ, పద్మ పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీతో తాగునీరు వృథా


పైప్‌లైన్ నుంచి వృథాగా పోతున్న తాగునీరు

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం శివారు వెంకటపతిపాలెంలో పైప్‌లైన్ లీకేజీతో తాగునీరు వృథాగా పోతుండడంతో ప్రజలు తాగునీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. గ్రామంలో తుపాను షెల్టర్ వద్ద వాటర్ ట్యాంకుకు నీరందించే పైప్‌లైన్‌లో రంధ్రం ఏర్పడింది. దీంతో రెండు రోజులుగా తాగునీరు వృథాగా పోతోంది. అయినా పంచాయతీ పాలకవర్గం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పైప్‌లైన్‌లో ఏర్పడిన అవాంతరాలను సరిచేసి నీటి వృథాను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పీఎంశ్రీ ఉన్నత పాఠశాలకు ఎన్‌సీసీ హోదా


విద్యార్థులు, ఉపాధ్యాయులతో కమాండర్‌లు నీరజ్‌కుమార్, స్వర్ణ ప్రభాత్

పెందుర్తి: స్థానిక పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎన్‌సీసీ యూనిట్‌ను మంజూరు చేస్తున్నట్లు 13వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారులు లెఫ్టినెంట్ కల్నల్‌లు నీరజ్‌కుమార్, స్వర్ణ ప్రభాత్ తెలిపారు. గురువారం పాఠశాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరితే క్రమశిక్షణ, పట్టుదల, కష్టపడే తత్వం అలవాటవుతుందన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని సాధించే దిశలో ఎన్‌సీసీ పాత్ర కీలకమైందన్నారు. ఉన్నత విద్య, ఉద్యోగ నియామకాల సమయంలో ఎన్‌సీసీ ధ్రువపత్రాలు ఉపయోగపడతాయన్నారు. దేశవ్యాప్తంగా 40 లక్షలకు పైగా ఎన్‌సీసీ క్యాడెట్‌లు ఉన్నారని వెల్లడించారు. ముందుగా ఎన్‌సీసీలో చేరేందుకు ఆసక్తి చూపిన విద్యార్థులకు అర్హత పరీక్షలు నిర్వహించారు. ఎంపికైన వారికి ఎన్‌సీసీ విధివిధానాలు వివరించారు. హెచ్‌ఎం సీహెచ్ చిన్నమ్మాయి, ఎన్‌సీసీ కేర్ టేకర్ టి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మానసిక అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

పెందుర్తి: మానసిక అనారోగ్యానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పెందుర్తిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెందుర్తి పాతూరులో నివాసం ఉంటున్న పాటి రామకృష్ణ(34) కొంత కాలంగా మానసిక రుగ్మతతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మధ్యవర్తిత్వ శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ–లీగల్ : జిల్లాలో 40 గంటల మధ్యవర్తిత్వ శిక్షణ కోసం అర్హులైన సీనియర్ న్యాయవాదులు, న్యాయవాదులు, సబ్జెక్టు నిపుణులు నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. అర్హులైన అభ్యర్థుల జిల్లాలో గల సంబంధిత న్యాయవాదులు సంఘం నుంచి జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

జాబిలీ హిల్స్‌లో చోరీ

- వృద్ధురాలిని బెదిరించి బంగారం తస్కరణ


బాధితులను విచారిస్తున్న పోలీసులు

అగనంపూడి: దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధి గళ్లవానిపాలెం జాబిలీ హిల్స్‌లో వృద్ధురాలిని బెదిరించి ఒక దొంగ బంగారు నగలు తస్కరించుకు పోయాడు. రోడ్డు నంబర్ 1లో కె.అమ్మన్నమ్మ, అల్లుడు, కుమార్తెతో కలిసి ఉంటున్నారు. బుధవారం సాయంత్రం కుమార్తె షాపింగ్ కోసం గాజువాక వెళ్లగా, మనుమడు పైఇంట్లో నిద్ర పోతున్నాడు. ఆ సమయంలో అమ్మన్నమ్మ ఒక్కరే ఇంట్లో ఉన్నట్లు గమనించిన దొంగ కత్తితో బెదిరించి ఆమె శరీరంపై ఉన్న బంగారు తాడు, గాజులు, చెవి దుద్దులు, రింగ్ వంటి దాదాపు ఆరు తులాల నగలను తస్కరించి పరారయ్యాడు. ఈ హఠాత్ సంఘటనతో స్పృహ కోల్పోయిన అమ్మన్నమ్మ తేరుకొని పక్కింటి వాళ్లకు దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాజువాక క్రైమ్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ మన్మధరావు ఘటనా స్థలానికి చేరుకుని బాధితుల నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిశోర బాలికలకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన


కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిర

సబ్బవరం: మండలంలోని మల్లునాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 11న జరపనున్న అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని జరిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిర పాల్గొని కిశోర బాలికలకు పలు అంశాల్లో సూచనలిచ్చారు. వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్య సంరక్షణ సాధ్యమన్నారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు. పౌష్టికాహారం, బాలల హక్కులు, చట్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలికలపై జరిగే లైంగిక దాడుల నుంచి ఎలా తప్పించుకోవచ్చు, చట్టాల పరంగా ఉన్న రక్షణలను వివరించారు. బాలికలకు ఆటల పోటీలతో పాటు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి సుమన్, అంగన్‌వాడీ కార్యకర్తలు సుభాషిణి, అక్కమ్మ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఏపీఎస్ శిక్షణతో యువతకు మెరుగైన ఉపాధి


వర్క్‌షాప్‌లో ప్రసంగిస్తున్న జేఎన్‌పీసీ ఎంఏ కార్యదర్శి సుబ్బారావు

పరవాడ: జాతీయ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీం (ఎన్ఏపీఎస్) ద్వారా యువతకు నైపుణ్యాలను పెంపొందించడం సాధ్యపడుతుందని జేఎన్‌పీసీ ఎంఏ కార్యదర్శి జెట్టి సుబ్బారావు అన్నారు. లైఫ్ సైన్సెస్ ఆధ్వర్యంలో విశాఖ ఫార్మాసిటీలో జేఎన్‌పీసీ ఎంఏ కార్యాలయంలో గురువారం నేషనల్ అప్రెంటిస్‌షిప్ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జెట్టి సుబ్బారావు మాట్లాడుతూ ఎన్ఏపీఎస్ ద్వారా కల్పించిన శిక్షణ యువతకు భవిష్యత్‌లో అనేక విధాలుగా ఉపయోగపడుతుందన్నారు. లైఫ్ సైన్సెస్, ఫార్మా, ఇతర తయారీ రంగాల్లో నైపుణ్య ఆధారిత మానవ వనరుల అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. పరిశ్రమలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని యువతకు ఉపాధి కల్పించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వర్క్‌షాప్‌లో అచ్యుతాపురం ఇండస్ట్రీస్ వైస్ ప్రెసిడెంట్ ఎం.ప్రసాద్, ఎల్ఎస్ఎస్ఎస్‌డీసీ తరపున సౌత్ ఇండియా హెడ్ పి.అమరేంద్రబాబు, డిప్యూటీ డైరెక్టర్ రాజన్ కౌల్, ఎన్ఎస్‌డీసీ స్టేట్ కోఆర్డినేటర్ కె.ప్రేమ్‌కుమార్, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ హెచ్ఆర్ మేనేజర్ లక్ష్మీదుర్గ, దాదాపు 40 పరిశ్రమలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటాద్రిపై ప్రత్యేక పూజలు


నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెందుర్తి: చాతుర్మాస్య దీక్షలో భాగంగా స్థానిక వేంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్తి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో సుందరకాండ హవనం చేశారు. అనంతరం శ్రీనివాస నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. భారీగా ఉభయదాతలు పాల్గొని, కల్యాణాన్ని తిలకించారు. ముందుగా స్వామివారికి గోత్రనామార్చనలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు

విశాఖ–లీగల్ : వినియోగదారుల హక్కుల చట్టం ప్రజలకు న్యాయం అందించడానికి ఒక బలమైన సాధనం అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు అన్నారు. గురువారం సిరిపురం వీఎంఆర్‌డీఏ మీటింగ్ హాలులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరులందరికీ వినియోగదారుల హక్కుల చట్టంపై అవగాహన అవసరమని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ స్థాయిలో ప్రజలు తమ హక్కులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల ఫోరం–2 జడ్జి వెంకటేశ్వరి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఆర్. సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.